నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 29 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

రేవంత్‌రెడ్డివి చౌకబారు పనులు

- కుటుంబ వేడుకను రేవ్ పార్టీ అనడం సిగ్గుచేటు
- తెలంగాణ సంస్కృతి తెలియని రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ మంత్రులు, నేతలు విదేశీ మద్యం తాగరా?
- వారి ఇళ్లలో ఫారిన్ లిక్కర్ లేదా?
- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు



ఖమ్మంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు

ఖమ్మం, అక్టోబర్ 28:బీఆర్ఎస్‌ను, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేని సీఎం రేవంత్‌రెడ్డి.. చౌకబారు పనులకు తెరతీస్తున్నారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఆరోపించారు. అందులో భాగంగానే కేటీఆర్ బావమరిది ఇంట్లో జరిగిన కుటుంబ వేడుకను రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ 11 నెలల పాలనలో ఏర్పడిన ప్రజా వ్యతిరేకతను పక్కదోవ పట్టించేందుకే ఇలాంటి చర్యలకు పూనుకున్నారని అన్నారు. కేటీఆర్ బావమరిది కొత్తగా నిర్మించుకున్న ఇంట్లో గృహ ప్రవేశం సందర్భంగా కుటుంబ వేడుకను ఏర్పాటు చేసుకుంటే దానిని రేవ్ పార్టీ అనడం సరికాదని, ఆ నెపంతో పోలీసులు సోదాలు చేయడం అత్యంత దారుణమని అన్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు తెలియని వ్యక్తులు తెలంగాణకు పాలకులుగా ఉండడం దురదృష్టకరమని అన్నారు. పండుగలు, శుభకార్యాలు జరిగినప్పుడు హాజరయ్యే బంధువులకు చుట్టరికం చేయడం సహజమేనని, అంత మాత్రాన అది తప్పని చెప్పడం అన్యాయమని అన్నారు. కేటీఆర్ బావమరిది ఇంట్లో జరిగిన వేడుకలో వారి కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రమే పాల్గొన్నారని తెలిపారు. రాజ్ పాకాల స్నేహితుడైన అమెరికా పౌరుడు విజయ్ కూడా ఆ వేడుకలో పాల్గొన్నారని, అంతమాత్రాన వారి ఇంట్లో డ్రగ్స్ పట్టుబడ్డాయని కాంగ్రెస్, బీజేపీ నాయకుల అనుకూల మీడియాలు తప్పుడు కథనాలు వండి వార్చాయని విమర్శించారు. కానీ ఆ ఇంట్లో డ్రగ్స్ ఆనవాళ్లు ఏమీ దొరకలేదని, కేవలం ఫారిన్ డ్రింక్ కొంత మేర లభించిందని ఎక్సైజ్ శాఖ అధికారులు స్టేట్‌మెంట్ రికార్డు చేశారని వివరించారు. ఆ స్టేట్‌మెంట్‌ను కూడా విలేకరుల ఎదుట తాతా మధు ప్రదర్శించారు. 'కాంగ్రెస్ మంత్రులు, నాయకుల ఇళ్లలో విదేశీ మద్యం లేదా?' అని ప్రశ్నించారు. 'వారు విదేశీ మద్యం తాగుతారో లేదో చెప్పాలి?' అని డిమాండ్ చేశారు. విదేశాల నుంచి వచ్చే వారెవరైనా ఒక్కొక్కరూ రెండు బాటిళ్లు వెంట తెచ్చుకోవచ్చనే నిబంధన ఉందని గుర్తుశారు. అయినప్పటికీ ఈ చిన్న విషయానికి దురుద్దేశాన్ని ఆపాదించి డ్రగ్స్ అని చెప్పడం శోచనీయమని అన్నారు.

ధైర్యముంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలి..

సీఎం రేవంత్‌రెడ్డికి ధైర్యముంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని హితవుచెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుంభకోణాలను కేటీఆర్, హరీశ్‌రావు సహా మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలు వెలుగులోకి తెస్తున్నారని అన్నారు. సివిల్ సప్లయి స్కాం, అమృత్ స్కీం స్కాం, మూసీ ప్రక్షాళన, హైడ్రా వంటివాటిపై గొంతెత్తుతున్న కేటీఆర్‌ను ఎదుర్కోలేకనే రేవంత్ రెడ్డి ఇలా చిల్లర చేష్టలకు దిగుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌కు వత్తాసుగా బండి సంజయ్, మెదక్ ఎంపీలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ నాయకులు కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, ఉప్పల వెంకటరమణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బిచ్చాల తిరుమలరావు, బెల్లం వేణు, పగడాల నరేందర్, జర్పుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పంట తాకిడి పెరిగింది..

జెండాపాట ధర తగ్గింది

- ఖమ్మం ఏఎంసీకి ఒక్కరోజే 35 వేల పత్తి బస్తాలు
- అమాంతంగా ధర తగ్గించిన ఖరీదుదారులు
- విధిలేక పంటను విక్రయించుకున్న దూది రైతులు

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 28 : పంట తాడికి పెరిగిన వేళ ఖరీదుదారులంతా ఏకమై ఒక్కసారిగా జెండా పాటను తగ్గించారు. దీంతో ఎన్నో ఆశలతో ఏఎంసీకి పంటను తెచ్చుకున్న పత్తి రైతులు విధిలేక అదే ధరకు విక్రయించుకోవాల్సిన పరిస్థితిని కల్పించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం పత్తి బస్తాలు పోటెత్తాయి. కొద్ది రోజులుగా కేవలం 5 నుంచి 8 వేల పత్తి బస్తాలే వస్తున్నాయి. అయితే రెండురోజుల సెలవుల అనంతరం తిరిగి సోమవారం మార్కెట్లో క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. ఉదయం పత్తి యార్డులో జరిగిన ఆన్‌లైన్ బిడ్డింగ్ ఓపెనింగ్ సమయానికి వివిధ జిల్లాల నుంచి రైతులు సుమారు 35 వేల పత్తి బస్తాల పంటను తీసుకొచ్చారు. దీంతో బిడ్డింగ్‌లో గరిష్ఠ ధర క్వింటాకు రూ.6,800 పలికింది. మధ్య ధర రూ.6,600 కాగా, కనిష్ఠ ధర రూ.5,900 చొప్పున నిర్ణయించి ఖరీదుదారులు కొనుగోలు చేశారు. కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం, పంట చేతికి వస్తుండడం, సీసీఐ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడం వంటి కారణాలతో ప్రైవేట్ వ్యాపారుల వద్దకు పంట భారీగా వచ్చింది. ఉదయం 9 గంటల సమయానికే పత్తి యార్డులోని నాలుగు ప్రధాన షెడ్లతోపాటు యార్డు ఆవరణ పూర్తిగా నిండిపోయింది. తరువాత కూడా పంట తాకిడి పెరగడంతో అపరాల యార్డులో షెడ్‌తోపాటు ప్రధాన వీధుల్లోనూ రైతులు తమ పత్తి బస్తాలను దిగుమతి చేశారు. దీంతో మార్కెట్ కమిటీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్.. సిబ్బందిని అప్రమత్తం చేశారు. త్వరితగతిన కాంటాల ప్రక్రియ, తోలకాలు చేపట్టాలని ఆదేశించారు. అధిక మొత్తంలో యార్డుకు పంట రావడాన్ని అదునుగా భావించిన ఖరీదుదారులు.. తమ సంప్రదాయ సూత్రాన్ని అమలు చేశారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే సీక్రెట్ బిడ్డింగ్ అయినప్పటికీ ఒక్కరోజులోనే గరిష్ఠ ధర క్వింటాకు రూ.300 తగ్గించి మరోసారి తమ సిండికేట్ దందాను విజయవంతంగా అమలుచేశారు.

అమాంతంగా ధర తగ్గించిన ఖరీదుదారులు

దాదాపుగా నాలుగేళ్ల తరువాత ఇంత భారీ మొత్తంలో పత్తి పంట మార్కెట్ యార్డుకు వచ్చిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. తెల్లవారే సరికి పత్తి యార్డంతా తెల్లబంగారంతో కళకళలాడుతుండడాన్ని చూసిన పత్తి ఖరీదుదారులు.. తక్షణమే తమ వ్యూహాలకు పదును పెట్టారు. ప్రస్తుతం సీసీఐ ధర రూ.7,520గా ఉంది. దీనికి ఇంచుమించుగానే ప్రైవేట్ ధర కూడా ఉండాలి. కానీ.. ఖరీదుదారులు అమాంతంగా ధర తగ్గించడంతో పంటను తెచ్చిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో గరిష్ఠ ధరను కేవలం 6,700కు పరిమితం చేసి.. కొనుగోళ్లను మాత్రం రూ.6,500కు దిగువనే ఉంచి పంటను కొనుగోలు చేశారు. 'ఇంత దారుణంగా ధర తగ్గిస్తారా?' అని కొందరు రైతులు ప్రశ్నిస్తే.. 'ఇష్టమైతే అమ్ముకో.. లేకపోతే ఇంటికి తీసుకపో..' అంటూ బయ్యర్లు సమాధానమిచ్చారు. దీంతో దిక్కు తోచని స్థితిలో వారు చెప్పిన ధరకే రైతులు తమ పంటను విక్రయించారు.

సీసీఐ కొర్రీలు తాళ లేక..

అయితే, సీసీఐ అధికారులు అనేక కొర్రీలు పెడుతుండడం వల్లనే రైతులు ఖమ్మం ఏఎంసీకి భారీగా పంటను తెస్తున్నారు. సీసీఐ కేంద్రాల కంటే ప్రైవేటులో రూ.1,000-రూ.1,500 ధర తక్కువగా ఉంటుందని తెలిసినా రైతులు ప్రైవేట్‌లోనే విక్రయిస్తున్నారు. సీసీఐకి విక్రయించాలంటే తేమ శాతం 8-12 మధ్య ఉండాలి. ప్రస్తుత పరిస్థితిలో ఆ తేమ శాతం నమోదు కావడం కష్టంగా ఉంది. దీంతో రైతులు ప్రైవేటు బాటపడుతున్నారు. అదీగాక వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పంట సాగు నమోదై ఉండాలి. కౌలు రైతు అయితే ధ్రువపత్రాన్ని వెంట తెచ్చుకోవాలి. ఈ సవాళ్లను అధిగమించి పంటను విక్రయించినా సకాలంలో చెల్లింపులూ అనుమానమే. దీంతో చాలామంది రైతులు తమ పత్తి పంటను ప్రైవేట్ ఖరీదుదారులకే విక్రయిస్తున్నారు. అయితే ఆఖరుకు తమతోనే, తమ పేరిటే ఈ పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయింపజేసి ఖరీదుదారులు సొమ్ము చేసుకోవడం ఖాయమని రైతులు బహిరంగంగానే చెబుతున్నారు.

పెట్టుబడి కూడా రావడం లేదు..

ఈ ఏడాది సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా వెళ్లే పరిస్థితి లేదు. నేను ఆరు ఎకరాల్లో పత్తి వేశాను. మొదటితీతలో 22 బస్తాల పంట చేతికొచ్చింది. మంచి ధర పలకాలనే ఉద్దేశంతో పంటను ఆరబెట్టి మరీ తీసుకొచ్చాను. కానీ.. క్వింటాకు రూ.6,300 చొప్పునే ఖరీదుదారులు కొన్నారు. పెట్టుబడి ఇచ్చిన వాళ్లు ఆగట్లేదు కాబట్టి తప్పని పరిస్థితిలోనే అమ్ముకోవాల్సి వచ్చింది. ఇక ప్రభుత్వం నుంచి పంటల పెట్టుబడి కూడా రాలేదు.

-వాసం తిరుపతయ్య, రైతు, తెల్దారుపల్లి, ఖమ్మం రూరల్

వ్యాపారులు చెప్పిందే ధర అవుతోంది..

ఇక్కడి వ్యాపారులు మా పంట నాణ్యతను చూడడం లేదు. వారు చెప్పిందే ధర అవుతోంది. పత్తి తీసిన కూలీలు ఆగడం లేదు. ఖాళీ చేతులతో తిరిగి వెళ్తే రేపు పండగ పూట వాళ్లతో మాటలు పడాల్సి వస్తుంది. అందుకే వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోంది. 3 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశా. ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టా. రూ.50 వేలు వస్తే పెట్టుబడి ఖర్చును తీర్చేయొచ్చు. రెక్కల కష్టం పోయినా పర్వాలేదనిపిస్తోంది.

-మందా వీరయ్య, రైతు, కమలాపురం, ముదిగొండ

రాష్ట్రంలో కక్షపూరిత పాలన

- ఇచ్చిన హామీలను గాలికొదిలి విదేశీ పర్యటనలా?
- కుటుంబ సభ్యులు దావత్ చేసుకుంటే రేవ్ పార్టీలని చిత్రీకరిస్తూ రాద్ధాంతం
- బీఆర్ఎస్ నేతల గొంతు నొక్కితే అంతకంతకూ ముందుకుపోతాం..
- భద్రాచలంలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

భద్రాచలంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

భద్రాచలం, అక్టోబర్ 28 : మాది ప్రజా పాలన అంటూ పదే పదే వల్లెవేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు రాష్ట్రంలో కక్షపూరిత పాలన సాగిస్తున్నారని, దీనిని ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా పాలనను గాలికొదిలేసిన మంత్రులు విదేశీ యాత్రల్లో విహరిస్తూ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించిందన్నారు. కేటీఆర్ కుటుంబ సభ్యులు తెలంగాణ సంప్రదాయం ప్రకారం దావత్ చేసుకుంటే దానిని రేవ్ పార్టీగా చిత్రీకరించి రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదని, విద్యార్థులు, ఉద్యోగులు, ఆఖరికి ఏఆర్ పోలీసులు కూడా రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్నారంటే వారి పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. తెలంగాణలో ఉప ఎన్నికలు జరిగితే కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. భవిష్యత్ అంతా బీఆర్ఎస్‌దేనని, కార్యకర్తలు అధైర్యపడకుండా ముందుకు సాగాలన్నారు. పాలక ప్రభుత్వాలు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల గొంతునొక్కే ప్రయత్నం చేస్తే అంతకంతకూ ముందుకు పోతామని రేగా స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు మానే రామకృష్ణ, చర్ల మండల అధ్యక్షుడు సోయం రాజారావు, సీనియర్ నాయకులు శ్రీనివాసరాజు, ఆకోజు సునీల్‌కుమార్, కణితి రాముడు, కోల రాజు, రేసు లక్ష్మి, రామిరెడ్డి, ప్రకాశ్, గుంజా ఏడుకొండలు, సీతామహాలక్ష్మి, కీసర యువరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి చేతకాకనే డైవర్షన్ రాజకీయాలు

కేటీఆర్‌ను ఎదుర్కోలేకనే కక్షసాధింపు చర్యలు

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకూ ఇబ్బందులే..

విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, అక్టోబర్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక.. రాజకీయంగా కేటీఆర్‌ను ఎదుర్కోలేక కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నదని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మండిపడ్డారు. మండల కేంద్రంలోని మసీద్ కాంప్లెక్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం చేతకాక.. కేటీఆర్ కుటుంబ సభ్యులపై డ్రగ్స్ పేరిట అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు, ఆటో కార్మికులు, ఉద్యోగులు, సామాన్యులు తీవ్రంగా నష్టపోయారని, రూ.2 లక్షల రుణమాఫీని పక్కకు పెట్టి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటిపై ఆయా వర్గాల ప్రజలు ఎక్కడ తిరగబడతారోననే ఉద్దేశంతో డైవర్షన్ పాలిటిక్స్‌కు కాంగ్రెస్ పార్టీ తెరలేపిందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసు కుటుంబాలకు సైతం రక్షణ లేకుండా పోయిందని, పోలీస్ కానిస్టేబుళ్లు రోడ్డుపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారంటే ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. గత కేసీఆర్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించారని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అన్ని విధాల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, యార్లగడ్డ శ్రీనివాసరావు, రూపా రాంబాబు, నాగయ్య, భూక్యా రాజు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని సీపీఐ ధర్నా

ఖమ్మం, భద్రాద్రి కలెక్టరేట్ల వద్ద బైఠాయింపు

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఖమ్మం కమాన్‌బజార్/కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 28 : రుణమాఫీ చేయాలని, రైతుల అపరిష్కృత సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అనుబంధ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ల ఎదుట బైఠాయించి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు, భద్రాద్రి జిల్లా సీపీఐ కార్యదర్శి సాబీర్‌పాషా, ఏఐకేఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్‌లు మాట్లాడారు. రైతుల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం గందరగోళంగా వ్యవహరిస్తున్నదని, రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతులకు కూడా మాఫీ వర్తించడం లేదన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉందన్నారు. 2018కి ముందు రుణాలు తీసుకున్న వారికి సైతం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా విషయంలో ఎకరాకు రూ.15 వేలు ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని, కానీ.. వర్షకాలం పంటలకు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వడ్లతోపాటు దొడ్డు వడ్లకు కూడా రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో రైతు సంఘం నాయకులు పోటు ప్రసాద్, దండి సురేష్, మౌలానా, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, కొమారి హన్మంతరావు, గుగులోత్ రాంచందర్, నరజాతి రమేశ్, యాస రోశయ్య, ఇమ్మానియేల్, సీతారామిరెడ్డి, బండి నాగేశ్వరరావు, ఇట్టి వెంకట్రావ్, శనిగరపు శ్రీను, గిరి, ఇరుకులపాటి సుధాకర్, విజయ్, మోహన్, అప్పారావు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఏఆర్ కానిస్టేబుళ్ల నిరసన

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బెటాలియన్ కానిస్టేబుళ్లు

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 28 : 'ఒకే పోలీస్-ఒకే విధానం' అంటూ బెటాలియన్ పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పడంతో వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ 6వ బెటాలియన్ వద్ద ఏఆర్ పోలీసులు సోమవారం మూడో రోజు విధులకు హాజరుకాకుండా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అందరికీ ఒకే రూల్ విధానంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పారని ఆరోపించారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా సస్పెన్షన్‌కు గురైన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం నుంచి భూషణ్‌రావును డిస్మిస్ చేసినట్లు ప్రకటించడం సరికాదని వారు పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ముగ్గురు మంత్రులున్నా పట్టించుకోరా?
- కొత్తగూడెంలో సీపీఎం నేతల నిరసన దీక్ష

కొత్తగూడెం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట నిరసన దీక్షలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 28 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ పెద్దాసుపత్రి, రామవరంలో ఉన్న మాతాశిశు ఆసుపత్రిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు.జిల్లా జనరల్ ఆసుపత్రి ఎదుట సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యర్యంలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేశ్ మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ప్రభుత్వ ఆసుపత్రులను పట్టించుకునే నాధుడే కరువయ్యాడని, అభివృద్ధి శూన్యంగా మారిందని అన్నారు. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం పడకేసిందన్నారు. ఆసుపత్రుల్లో రోగులకు సరైన వైద్యం అందడంలేదని, మందుల కొరత తీవ్రంగా ఉందని, సిబ్బంది కొరత, ల్యాబ్, ఎక్స్‌రే మిషన్, స్కానింగ్ తదితర పరికరాలు పనిచేయకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాతాశిశు ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే గర్భిణులను ప్రసవం కోసం ఖమ్మం, వరంగల్ ఆసుపత్రులకు బలవంతంగా పంపిస్తున్నారని అన్నారు. ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధామోహన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీఇవ్వడంతో దీక్ష విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లిక్కి బాలరాజు, భూక్యా రమేశ్, వీరన్న, రమేశ్, పద్మ, రాంచరణ్, రఘు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, అక్టోబర్ 28 : ప్రజలు సమర్పించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వైరా మండలం రెబ్బవరానికి చెందిన శ్యామ్‌కుమార్, బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన తమ్మారపు సామ్రాజ్యం, చింతకాని మండలం సీతంపేటకు చెందిన వెగ్గళం సాహిత, ఎర్రుపాలెం మండలం సఖినవీడుకు చెందిన చిన్నం రత్తయ్య తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాలు మాఫీ చేయాలని, వెంటనే రైతు భరోసా ఇవ్వాలని, సన్నరకంతోపాటు దొడ్డు రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.